## సంక్షిప్త సమాచారం

**నేడు డిప్యూటీ కలెక్టర్ సమీక్ష**

**రొళ్ల:** మడకశిర మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో జరిగే సమీక్ష సమావేశానికి మండలస్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామరావు తెలిపారు.

**నేడు ఆలయ వార్షికోత్సవం**

**రొళ్ల:** మండల కేంద్రంలో వెలసిన శనేశ్వరస్వామి ఆలయ 37 వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా సుప్రభాత సేవలు, నవగ్రహారాధన, నల్లటి నువ్వులతో జ్యోతి ప్రజ్వల తదితర పూజలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

**అగ్ని ప్రమాదంలో రూ.4 లక్షల ఆస్తి నష్టం**



కాలిపోయిన గడ్డి వాము, సజీవ దహనమైన ఆవు

**పావగడ:** తాలూకాలోని అరసికెరె పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన కారనగనహట్టి గ్రామంలో మంగళవారం రైతు బడ నాగప్పకు చెందిన గడ్డి వాము దగ్ధమైంది. ఈ ఘటనలో ఆవు కూడా సజీవ దహనమైంది. సమీపంలోని కొండకు నిప్పు పెట్టడంతో అగ్ని మంటలు వ్యాపించినట్లు స్థానికులు తెలిపారు. 5 ఆవుల్లో ఒక ఆవు సజీవ దహనం కాగా మరో ఆవు తీవ్ర గాయాలైనట్లు చెప్పారు. మూగ జీవాలను రక్షించేందుకు వెళ్లిన రైతు నాగప్ప కూడా తీవ్ర గాయాల పాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సుమారు రూ.4 లక్షలు ఆస్తి నష్టం సంభవించినట్లు బాధిత కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేశారు.

**మసీదును సందర్శించిన ఎమ్మెల్యే**

**మడకశిర:** పట్టణంలో నూతనంగా నిర్మించిన జామియా మసీదును మంగళవారం స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సందర్శించారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు ఎమ్మెల్యేని ఘనంగా సన్మానించారు. ముస్లింల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సమస్యలన్నీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

**టీటీ విజేత జనార్దన్**

**గుడిబండ:** మడకశిర ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో డిప్లొమా కోర్సు చదువుతున్న గుడిబండ మండలం కొంకల్లు గ్రామానికి చెందిన జనార్దన్ ఇటీవల నంద్యాల జిల్లాలోని మహానంది వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. టేబుల్ టెన్నిస్‌లో విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా జనార్దన్‌ను అతని తల్లిదండ్రులు శివన్న, మంజులతో పాటు ప్రిన్సిపల్ సరోజినీదేవి, ఫిజికల్ డైరెక్టర్లు రమేష్, అశిష్‌కుమార్ అభినందించారు.

**కేబుల్ చోరీ**

**మడకశిర:** పట్టణ సమీపంలోని మల్లినాయకనపల్లిలో రైతు నాగరాజుకు చెందిన వ్యవసాయ బోరు బావి కేబుల్ అపహరణకు గురైంది. 80 మీటర్ల కేబుల్ ఎత్తుకెళ్లారని రూ.10 వేలు నష్టం వచ్చిందని నాగరాజు తెలిపారు. నెల వ్యవధిలోనే 12 మంది రైతులకు చెందిన వైర్లు చోరీకి గురయ్యాయన్నారు.

**నేడు పింఛన్ల పరిశీలన**

**రొళ్ల:** మండల వ్యాప్తంగా పది పంచాయతీలో 14 మంది దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ మంచానికే పరిమితమై రూ.15 వేలు పింఛన్లు పొందుతున్న లబ్ధిదారుల పింఛన్లను బుధవారం తనిఖీ చేయనున్నారు. వైద్యబృందం వారి ఆరోగ్య స్థితిని పరిశీలిస్తుందని పేర్కొన్నారు.

**ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి**

**హిందూపురం అర్బన్:** ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వన్‌టౌన్ సీఐ రాజగోపాల్‌నాయుడు పేర్కొన్నారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో బాగంగా మంగళవారం పట్టణంలోని ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. వన్‌టౌన్ స్టేషన్ ఆవరణంలో ఆటో డ్రైవర్లతో సీఐ మాట్లాడారు. ఆటోలకు తప్పని సరిగా వాహన అనుమతులు, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీధర్, శశికళ, ఏఎస్‌ఐ జయరామ్, అంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

**భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి**

**పెనుకొండ రూరల్:** అభ్యంతరాలు లేని ప్రభుత్వ భూములు క్రమబద్ధీకరణ కోసం ప్రజలు దరఖాస్తు చేసుకోవచ్చని ఆర్డీఓ ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు. 2019 అక్టోబర్ 15ను ప్రామాణికంగా తీసుకొని, ఆ తేదీ కంటే ముందు ఆక్రమణలో ఉన్న భూములను నిబంధనలకు అనుగుణంగా క్రమబద్ధీకరిస్తామన్నారు. ఈ ఏడాది డిసెంబర్ 31 వరకూ మీసేవా, గ్రామ, వార్డు సచివాలయాలలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. క్రమబద్ధీకరణ పట్టాలను మహిళల పేరుతో మాత్రమే జారీ చేస్తామని ఆర్డీఓ తెలిపారు.

**డ్రిప్ పరికరాలకు నిప్పు**

**మడకశిరరూరల్:** మండల పరిధిలోని మరువపల్లి గ్రామ సమీపంలో రైతు వెంకటేష్ పొలంలోని డ్రిప్ పరికరాలకు మంగళవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. అదే విధంగా పత్తి పంట కూడా కొంత కాలిపోయిందని బాధిత రైతు వెంకటేష్ ఆవేదన వ్యక్తం చేశారు.

**చెరువుల అభివృద్ధికి చర్యలు**

**మడకశిర:** నియోజకవర్గంలో చెరువుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తెలిపారు. ఆయన మంగళవారం ఆర్ అండ్‌బీ బంగ్లాలో మైనర్ ఇరిగేషన్‌శాఖపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో నీటి సంఘాల అధ్యక్షులు కూడా పాల్గొన్నారు. మండలాల వారీగా చెరువుల అభివృద్ధిపై చర్చించారు. చెరువుల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

**ఆర్‌డబ్ల్యూఎస్ శాఖపై సమీక్ష**

నియోజకవర్గంలోని ఆర్‌డబ్ల్యూస్ శాఖపై కూడా ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సమీక్ష నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూస్ ఎస్‌ఈ, ఈఈ, డీఈ, ఏఈలతో పాటు ఎంపీడీఓలు, ఈఓఆర్డీలు పాల్గొన్నారు. ప్రధానంగా వచ్చే వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు.

**జాతరోత్సవాలు ప్రారంభం**

**మడకశిర:** పట్టణంలోని మిట్టబండ ఆంజనేయస్వామి జాతర మహోత్సవాలు మంగవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు సీతారాముల కల్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆంజనేయస్వామి మూల విరాట్ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు వివిధ అభిషేకాలు, పూజలు నిర్వహించారు. బుధవారం బ్రహ్మ రథోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

**నేటి నుంచి చెరువులకు నీరు**

**పెనుకొండ:** గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి చెరువులను నీటితో నింపే కార్యక్రమాన్ని మంత్రి సవిత బుధవారం ప్రారంభించనున్నారు. ఉదయం 10 గంటలకు గొల్లపల్లి రిజర్వాయర్ వద్ద జలహారతి అనంతరం చెరువులకు నీటి విడుదల చేసేందుకు గేట్లు తెరవనున్నారు. పెనుకొండ, మడకశిర, హిందూపురం నియోజకవర్గాల్లోని పలు మండలాల చెరువులకు రిజర్వాయర్ నుంచి నీరు చేరనుంది.

**ఉన్నత చదువుకు ఆర్థికసాయం**

**అగళి:** గ్రామీణా ప్రాంతంలో విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్డీటీ ద్వారా చేయూతనిచ్చి వారి ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేస్తున్నట్లు ఏటీఎల్ ఓబులేశ తెలిపారు. మండల పరిధిలోని ఇనగలూర్ పంచాయతీలో 12 మంది విద్యార్థుల ఉన్నత చదువులకు రూ.93 వేల చెక్కును విద్యార్థుల తల్లిదండ్రులకు అందించారు.

**పాడి ఆవు అపహరణ**

**రొద్దం:** మండల పరిధిలోని గోనిమేకులపల్లిలో రైతు మాలాశికి చెందిన పాడి ఆవు నాలుగు రోజుల క్రితం అపహరణకు గురైంది. ఈ ఘటనపై బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంటి వద్ద కట్టేసిన రూ.80 వేలు విలువ చేసే ఆవును దొంగలు టాటాఏస్ వాహనంలో ఎత్తుకెళ్లారని బాధిత రైతు వాపోయారు.

**ఈరలింగేశ్వరస్వామికి తలనీలాలు**

**అమరాపురం:** మండల పరిధిలోని బంగారు పాళ్యం గ్రామ సమీపంలో వెలసిన ఈరలింగేశ్వరస్వామికి భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా గొడనకుంట నుంచి కలశాలను డప్పు వాయిద్యాలతో ఈరలింగేశ్వరస్వామి ఆలయం వద్దకు తీసుకొచ్చారు. అక్కడ స్వామి వారికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం మేలు దీపాన్ని వెలిగించి ధ్వజ స్థంభంపై ఉంచి మొక్కులు తీర్చుకున్నారు.

# 17 నుంచి సమ్మెలోకి కార్మికులు



నిరసన తెలుపుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ కార్మికులు

**హిందూపురం టౌన్:** ఆర్‌డబ్ల్యూఎస్‌లో పనిచేస్తున్న కార్మికులు ఈ నెల 17న అర్ధరాత్రి నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు సీఐటీయూ నాయకులు, కార్మికులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం గొల్లపల్లి పంప్ హౌస్ వద్ద నిరసన తెలిపి, సమ్మె తీర్మానం చేశారు. సీఐటీయూ పట్టణ కన్వీనర్ రాము మాట్లాడుతూ పెనుకొండ, హిందూపురంలోని డివిజన్లలో 53 మంది కార్మికులకు గత ఏప్రిల్ నెల నుంచి పది నెలల జీతాలు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెల్లించలేదన్నారు. కార్మికుల జీతాల కోసం గత పది నెలల నుంచి ఎన్నోసార్లు ఉన్నతాధికారులకు రాతపూర్వకంగా వినతిపత్రాలు ఇచ్చామన్నారు. జీతాలు చెల్లించడంలో అధికారులు కాలయాపన చేస్తున్నారని అన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ స్కీంలో కార్మికులు గత 15 సంవత్సరాలుగా పనిచేస్తున్నారన్నారు. కార్మికులకు రావాల్సిన పది నెలల జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు కేఎల్ సోము, కార్యదర్శి మురళీ, కమిటీ సభ్యులు నాగేంద్ర, గిరి, జబీవుల్లా, శివకుమార్, రవికుమార్, నరసింహమూర్తి, సోమయ్య, చిన్నపరెడ్డి, మంజు, జగదీశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయిలో రాణించడం అభినందనీయం



కరాటేలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న మున్సిపల్ చైర్మన్

**హిందూపురం టౌన్:** పట్టణానికి చెందిన కరాటే విద్యార్థులు రాష్ట్రస్థాయిలో జరిగిన కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయిలో రాణించడం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ రమేష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో జరిగిన స్టేట్ కరాటే చాంపియన్ షిప్ పోటీలలో హిందూపురం పట్టణానికి చెందిన పది మంది విద్యార్థులు పాల్గొని ధనుష్ కుమార్ ప్రథమ స్థానంలో, సయ్యద్, కిషోర్ కుమార్ ద్వితీయ, శోభన్, సయ్యద్ బరీర ఐమాన్, జాన్ విక్టర్, రిషి రామ్, కనిష్కా, వెంకట్‌లు తృతీయ స్థానాల్లో నిలిచి ప్రతిభ కనబరిచారు. ప్రతిభ కనబరిచిన కరాటే విద్యార్థులను మంగళవారం మున్సిపల్ కమిషనర్ చాంబర్ వద్ద మున్సిపల్ చైర్మన్, కమిషనర్, కౌన్సిలర్లు అభినందించారు.

## మామిడి తోటలకు నిప్పు



కాలిపోయిన మామిడి చెట్లు

**పరిగి:** మండలంలోని హొన్నంపల్లి గ్రామ పరిధిలో ఉన్న శిరేకోళం రెవెన్యూ విలేజ్‌కు చెందిన 107–3 సర్వే నంబరుపైకి ఉన్న ఏడెకరాల ముప్పై మూడు సెంట్ల విస్తీర్ణంలో ఉన్న మామిడి చెట్లకు నిప్పంటించారు. ఈ ఘటనలో దాదాపు 200 చెట్లు అగ్నికి ఆహుతైనట్లు బాధిత రైతు సుగాలి అనసూయమ్మ తెలిపారు. గత రెండు రోజుల క్రితం సదరు వ్యవసాయ పొలంలో పదేళ్ల క్రితం మామిడి చెట్లు నాటినట్లు పేర్కొన్నారు. చెట్లన్నీ పూర్తిగా కోతకు వస్తున్న తరుణంలో దుండగులు చెట్లకు నిప్పంటించారన్నారు. అలాగే 40 చింత చెట్లు, మరో 30 నేరేడు చెట్లు సైతం అగ్నికి ఆహుతైనట్లు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పాటు సుగాలి నాగరాజు, సావిత్రమ్మకు చెందిన మరో 80 మామిడి చెట్లు సైతం కాలిపోయాయన్నారు. ఈ ఘటనలకు సంబంధించి మంగళవారం పరిగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

## జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపిక



నూరి సద్మను అభినందిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి

**హిందూపురం టౌన్:** పట్టణంలోని బాలయేసు డిగ్రీ కళాశాలలో బీఎస్సీ రెండో సంవత్సరం చదువుతున్న నూరి సద్మ జాతీయ సమైక్యత శిబిరానికి అర్హత సాధించడంపై మున్సిపల్ వైస్ చైర్మన్, ఆ కళాశాల ప్రెసిడెంట్ బలరామిరెడ్డి, ప్రిన్సిపాల్ జియావుల్లాఖాన్ అభినందించారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక కళాశాలలో అభినందన సభ నిర్వహించారు. మహారాష్ట్రలోని కొల్హాపూర్ శివాజీ విశ్వవిద్యాలయంలో ఈనెల 16 నుంచి 22 వరకూ జరిగే జాతీయ సమైక్యత శిబిరంలో ఆంధ్రప్రదేశ్ నుంచి విద్యార్థిని పాల్గొంటుందన్నారు. ప్రోగ్రాం అధికారులు అశ్వర్ధనారాయణ, హరీష్, అధ్యాపకులు శివరామిరెడ్డి పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరానికి స్పందన

**హిందూపురం టౌన్:** ఏపీఎస్‌ఆర్టీసీ స్థానిక డిపోలో రోడ్డు భద్రత మాసోత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి స్పందన లభించింది. దాదాపుగా 27 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. ఆర్టీసీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అపర్ణ, ఇన్‌చార్జ్ డిపో మేనేజర్ ఇనాయతుల్లాలు, గ్యారేజ్ ఎంఎఫ్ నిశాంత్, ట్రాఫిక్ ఇన్‌చార్జ్ నాయక్, డిపో ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## వేడుకగా శనీశ్వరస్వామి కల్యాణం



శనీశ్వరస్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

**పావగడ:** శనీశ్వరస్వామి జాతరోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం ఆలయంలో మహా చండి హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం శనీశ్వరస్వామి, జ్యేష్టాదేవి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**అగళి:** మండల పరిధిలోని ఉప్పర్ తోణసపల్లి నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఇసుక ట్రాక్టర్, జేసీబీని మంగళవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్, జేసీబీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

## నేడు పుట్టగూర్లపల్లిలో కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ లీడర్స్

**పరిగి:** మండలంలోని మోదా పంచాయతీ పరిధిలోని పుట్టగూర్లపల్లిలో బుధవారం కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ లీడర్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ నరసింహమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ పాల్గొంటారన్నారు. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.

## వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

**రొద్దం:** మండల పరిధిలోని గోనిమేకులల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పురుషోత్తం రెడ్డి (70) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ భర్త శ్రీచరణ్‌రెడ్డి మంగళవారం ఆ గ్రామానికి చేరుకుని పురుషోత్తంరెడ్డి మృతదేహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బి.తిమ్మయ్య, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



# పురం ఇలవేల్పు పేట వేంకటరమణస్వామి



**హిందూపురం అర్బన్:** పట్టణంలో వెలసిన పేట వేంకటరమణస్వామి హిందూపురం ఇలవేల్పు. హిందూరావు అనే మరాఠా సామంతరాజు ఈ ప్రాంతాన్ని పాలించే వారు. ఆయన పేరుపైనే హిందూపురం అన్న నామకరణ జరిగింది. రాజు తన తల్లిదండ్రులు వృద్ధాప్య దశలో తిరుమల వేంకటేశ్వరున్ని దర్శించాలని కలలు గన్నా వయస్సు సహకరించలేదట. ఇక ఈ జన్మకు అది సాధ్యం కాదని ఆవేదన చెందేవారట. ఇందులో భాగంగానే ఒకరోజు హిందూరావుకు వేంకటేశ్వరస్వామి కలలో వచ్చి తిరుమలకు వచ్చి తనను దర్శించుకోలేని భక్తుల కోసం హిందూపురంలోనే ఆలయం కట్టించాలని ఆజ్ఞాపించారని, ఆ మేరకే ఇక్కడ ఆలయ నిర్మాణం జరిగినట్లు చరిత్ర చెబుతోంది. తల్లితండ్రుల కోర్కెను తీర్చేందుకు హిందూపురంలోని మెయిన్ బజారులో క్రీ.శ.764లో ఆలయం నిర్మించినట్లు ఆధారాలు ఉన్నాయి. నాటి నుంచి నేటి భక్తుల కొంగు బంగారంగా పేట వేంకటరమణుడి పేరుతో స్వామి వారు ఇక్కడ పూజలు అందుకుంటున్నారు. తిరుమలకు వెళ్లలేని వారి కోర్కె తీర్చడమే కాకుండా ఈ ప్రాంత వాసులకు ఇక్కడే దర్శన భాగ్యం కలిగించేందుకే వెంకటరమణుడు ఇక్కడ కొలువైనట్లు భక్తుల విశ్వాసం.

**కొల్హాపురి మహాలక్ష్మి ఉత్సవం**

**అగళి:** మండల పరిధిలోని నరసబుందిలో కొల్హాపురి మహాలక్ష్మీదేవికి మంగళవారం జ్యోతుల ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఉత్సవ విగ్రహాన్ని సోమవారం సాయంత్రం ఊరేగింపుగా తీసుకువెళ్లి కొలువుతీర్చారు. మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి జ్యోతులను సమర్పించారు.

**ఘనంగా హారతుల ఉత్సవం**

**అమరాపురం:** మండల పరిధిలోని వలస గ్రామంలో మంగళవారం భూతరాయస్వామి, గౌడచంద్రమ్మ, కరియమ్మ స్వామివార్లకు హారతుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కలశాలను ఏర్పాటు చేసుకుని గ్రామ వీధుల గుండా ఊరేగింపుగా ఆలయం వరకూ వెళ్లి స్వామి వార్లకు పూజలు చేశారు.

**వైభవంగా జ్యోతుల ఉత్సవం**



జ్యోతులు తీసుకెళ్తున్న మహిళలు

**సోమందేపల్లి:** మండలంలోని మాగే చెరువు గ్రామంలో వెలసిన కోల్లాపురి మహాలక్ష్మి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం జ్యోతుల ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో గంగపూజ, గణపతి ప్రార్థన, అభిషేకాలతో పాటు మహిళలు జ్యోతులతో ప్రదర్శనగా వచ్చి అమ్మవారికి సమర్పించారు. బుధవారం రథోత్సవం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

**నేడు బ్రహ్మ రథోత్సవం**

**అమరాపురం:** స్థానిక శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి బ్రహ్మ రథోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

**బైలాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట**

**లేపాక్షి:** మండలంలోని కల్లూరు పంచాయితీ మల్లిరెడ్డిపల్లిలో మంగళవారం ఉదయం బైలాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. పురోహితులు రామాంజప్ప, సతీష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.